

# ‘అదే’ కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని ‘దేశీ’లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం ‘య’ అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

## 46
## రబ్బర్ బంతి

**ఎమ్మెస్సీ పూర్తి చేసిన కల్పన జోషికి** పెళ్లయ్యేసరికి ఇరవై రెండేళ్ళు మాత్రమే. బాగా చదువుకున్నదనీ మంచి తెలివైనదనీ పేరు. పెళ్ళికొడుకు బాంబే ఐ ఐ టి లో చదువుకున్నాక బాంబేలోనే ఉద్యోగం. “ఐ ఐ టి నుంచి దాదాపు అందరూ అమెరికా వెళ్తారు కదా మీరు ఇక్కడే ఉంటారా లేక అమెరికా వెళ్తారా?” అని అడిగినప్పుడు నితీష్ ఇచ్చిన సమాధానం ఇదీ – “ఐదేళ్ళు ఇండియాలో పనిచేసి అమ్మా నాన్నల్ని చూసుకోవాలి. ఆ తర్వాత వెళ్దామని అనుకుంటున్నా. ఐదేళ్ళంటే ఎంత ఇట్టే గడిచిపోవూ?”

అలా ఇద్దరికీ పెళ్ళైపోయింది. అబ్బాయిగారింట్లో అడుగుపెట్టాక కల్పన కి తెల్సిన విషయాలు అనేకం. అత్తగారు ధాటీ మనిషి. ఉన్న ఒకే ఒక కొడుక్కి పెళ్లవగానే కల్పనని ఇంట్లోకి రానిచ్చి ఆవిడ వెంఠనే తన రిటైర్మెంట్ ప్రకటించింది. దాని ప్రకారం ఇప్పుడు పొద్దున ఆరునుంచి రాత్రి పది దాకా మొత్తం ఇంట్లో పనంతా కల్పనదే. పొద్దున్నే డబ్బా పట్టుకుని బయలుదేరిన మొగుడు సాయంత్రం ఏడింటిలోపున ఇంటికొస్తే గొప్పే. శనాదివారాలలో ఏవరో వస్తారు లేదా మొగుడితో కల్పన బయటకి వెళ్తుంది. ఆరునెలలకి ఓ సారి అటువంటి వీకెండ్ ట్రిప్పులో మహాలక్ష్మి స్టేషన్ దగ్గిర దిగుతూంటే కల్పనకి తన స్నేహితురాలు కనిపించింది. కల్పనని చూసి ఆశ్చర్యపోవడం ఆవిడ వంతు. కాలేజీ డిబేట్ లలో, చదువులో

అన్నింట్లోనూ అద్భుతంగా రాణించిన కల్పన ఇప్పుడో గృహలక్ష్మి. వంట చేయడం బట్టలుతకడం వంటి పనులతోనే ఆవిడకి తెల్లారిపోతోందిట.

స్నేహితురాలు కథ అంతా విని నితీష్ తో అంది – "తప్పు మీదేనండి, కాస్త కల్పనని ఏ బేంక్ లోనో ఉద్యోగం సంపాదించమనవచ్చు. లేదా కల్పన బ్రిలియంట్ కనక అయ్యేఎస్ అయినా అవుతుంది. ఇలా వంటింట్లో గానుగెద్దుగా మార్చడం ఛండాలంగా ఉంది."

ఈ బ్రెయిన్ వాష్ నితీష్ మీద అంత పనిచేసినట్టులేదు.

ఇంటికొచ్చాక వచ్చేదారిలో ఇద్దరూ వాదించుకున్నారు. ఏమీ తేలలేదు. తాను తల్లికి లేటుగా పుట్టాడు దాదాపు నలభై ఏళ్ళ వయసులో. తల్లీ తండ్రీ ముసలితనంలో ఉన్నారు. వాళ్ళని వదిలేసి ఏ అమెరికాయో వెళ్లడం కుదరదు. వాళ్ళు కూడా రావాలంటే వీసా అదీ ఎలా? మొత్తానికి అక్కడితో ఆగింది అది.

మూడేళ్ళు గడిచాయి.

పనిచేసి ఇంటికొచ్చిన మొగుడు రాత్రి సేదతీరడానికి కల్పనని వాడుకోవడంతో ఇంట్లో ఇప్పుడు ఇద్దరు చిన్నపిల్లలు వెలిసారు. పొద్దున ఆరింటికి పని మొదలుపెట్టే కల్పన ఇప్పుడు నాలుగింటికే మొదలుపెడుతోంది. చురుకైనది కనకా ఆరోగ్యంగా ఉంది కనకా ఏమీ ఢోకాలేదు కానీ ఆవిడకి జీవితం విసుగెత్తుతోంది. ఈ మొగుడు తల్లి తండ్రులని వదులుకోలేని పరిస్థితి, అటు వేరేగా ఉండడం కుదరని పరిస్థితి.

ఏం చేయాలో ఎటూ తేలకుండా మరో రెండు ఏళ్ళు గడిచాయి. పిల్లలని మరో రెండేళ్లలో స్కూళ్లలోకి దింపాలి. ఎన్నోసార్లు నితీష్ కి చెప్పడానికి ప్రయత్నం చేసింది. ఆశానిరాశల్లో కొట్టుకుంటూ కల్పన తెల్సుకున్నది ఇది – ఈ ఐ ఐ టి కుర్రాడు తాము అనుకున్నంత గొప్పవాడేం కాదు. బుర్ర ఉంది సరే కానీ ఇలా ఎదుగూ బొదుగూ లేని రెండు బెడ్రూంల అపార్ట్ మెంట్లో ఎంతకాలం బతుకుతారు? తన జీవితం అంతే. ఈ అత్తగారి సాధింపూ అదీ తనకి వదలడం అనేది అసాధ్యం. తాను తన తల్లీ తండ్రీ తో చెప్పినా వాళ్ళు ఇందులో జోక్యం చేసుకోరుట. తన జీవితం తనదే. మళ్ళీ చదువుకోగలదా, ఉద్యోగం చేయగలదా? మొగుడిమీత రోత మొదలవడం అది తీవ్రమైన స్థాయికి జేరడం కల్పనకే తెలుస్తోంది.

ఇంక తన జీవితం ఇంతే అనుకునే సమయానికి తమ పెళ్ళికి రాని నితీష్ స్నేహితుడు అమెరికానుంచి వచ్చి వీళ్లని చూట్టానికొచ్చాడు – ఏదో బహుమతి పట్టుకుని. వాడు వస్తూనే వీళ్ల సంగతి చూసి ఓ లెక్చర్ మొదలుపెట్టాడు. "ఇలా జీవితం గడపడం దుర్భరం. వెంఠనే అమెరికా వెళ్లడానికి ప్రయత్నం చేయి. తల్లీ తండ్రీ మొదట్లో గునిసినా డాలర్లు పంపుతావు కనక పనిమనిషిని పెట్టుకుని సుఖంగా ఉండగలరు. అయినా మంచి తెలివైన కల్పనని ఇలా నొక్కిపెట్టేసి ఉంచడం మంచిదా? ఆలోచించు బ్రదర్" అంటూ తలవాచేలా చివాట్లు పెట్టాడు. వాడు వెళ్లాక కాబోలు నితీష్ గారికి

మనసులో మధనం మొదలైంది. తల్లికీ తండ్రికీ చెప్పకుండా తన ప్రయత్నాలు తాను మొదలుపెట్టాడు. ఐతే ఇన్నేళ్ళకి మరోసారి చదువుకోవడం అనవసరం. డైరక్ట్ గా ఉద్యోగానికే ప్రయత్నం చేయవచ్చు. అలా తన కాయితాలు పట్టుకుని మరో ఏడాదికి మిన్నెసోటాలో ఉద్యోగం సంపాదించాడు. ఒక్కడూ వెళ్లడం ఓ ఇబ్బంది మొదట్లో కానీ తప్పదు కదా? తల్లికీ తండ్రికీ చెప్పేముందు కల్పనతో చెప్పేడు అసలు సంగతి. నితీష్ కల్పనని కూడా తీసుకెళ్లవచ్చు. పిల్లలు వేరుగా మూడు నుంచి ఆరునెలల్లో రావచ్చు. తల్లికీ తండ్రికీ ఏం చెప్పాలో నిర్ణయించుకున్నాక మర్నాడు చెప్పాడు.

నితీష్ ని తమ కంపెనీ అమెరికా పంపిస్తున్నారు ఏడాది పాటు. భార్యాభర్తలకి వీసా ఇస్తారుట. కానీ పిల్లలు రావడానికి మూడునుంచి ఆరు నెలలు పడుతుంది. ఒక్క ఏడాదే పని. తర్వాత వెనక్కి వచ్చేస్తాడు. పిల్లలని చూడ్డానికి అత్తామామల్నో వేరెవర్నో ఆయాని కుదిరించి వెళ్తారు. మూడు నెలల్లో వీసా రాగానే పిల్లలని కూడా తీసుకెళ్ళి ఒకే ఒక్క ఏడాదిలో వెనక్కి వచ్చేస్తారు. తల్లీ తండ్రీ ఆలోచించారు. కుర్రాడు ఇప్పటిదాకా తమని బాగా చూసుకున్నట్టే లెక్క. పాపం వాడి స్నేహితులందరూ అమెరికా వెళ్ళినా వీడు తమకోసం ఇక్కడే ఉండిపోయాడు. అందువల్ల సరే ఓకే అనేసారు. వెంఠనే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయాని కుదిర్చి అందరికీ వీడ్కోలు చెప్పి విమానం ఎక్కేసారు దంపతులు. పెళ్ళైనప్పుడు ఎప్పుడో ఏకాంతం దొరికనిచ్చేవారు ఇంట్లో. ఇప్పుడు అటువంటి ఇబ్బంది లేదు కనక చెట్టాపట్టాల్ వేసుకుని మిన్నెసోటాలో దిగింది జంట. అనుకున్నది ఒకటైతే జరిగింది మరొకటి.

నిరంతరం స్నో పడుతున్న మిన్నెసోటా అబ్బాయిగారికి నచ్చలేదు. తల్లీ తండ్రీ గుర్తొస్తున్నారు. టివిలో వచ్చే అమెరికన్ ఫుట్ బాల్ అసలే నచ్చలేదు. బేస్ బాల్ తనకి అర్థం కాదు. తాను పడి చచ్చే క్రికెట్ లేదంటే లేదు. ఈ ఉద్యోగం మానేసి వెంఠనే వెనక్కి పోదాం అని ఆయన గోల. కల్పన విషయం వేరు, ఆవిడకి ఇప్పుడు యూనివర్సిటీలో చదువుకునే ఛాన్స్ ఉంది. తన తెలివితేటలకి ఏదో ఒకటి కుదురుతుంది. ఇరుకు బాంబే ఇంట్లో కంటే ఈ జీవితం ఎంతో బెటర్. అన్నింటికన్నా ముఖ్యం, అత్తగారి సాధింపు లేదు సుఖంగా నిద్రపడుతోంది. తన కెరీర్ మళ్ళీ పునరిద్ధరించుకోవచ్చు. కల్పన అనేకసార్లు చెప్పిచూసింది ఈ విషయాలన్నీ మొగుడితో; ఆయన ససేమిరా అనడం మానలేదు.

ఇలా ఆరునెలలు గడిచాక ఓ రోజు నితీష్ ఇంటికొచ్చేసరికి అపార్ట్ మెంట్ మెయిల్ బాక్స్ దగ్గిర కల్పన ఎవరో తెల్లాయనతో గలగలా మాట్లాడుతోంది. తర్వాత తెల్సిన విషయం ప్రకారం ఆయన పేరు డెరెక్; పైన వేరే అపార్ట్ మెంట్లో ఉంటాట్ట. ఓ సారి ఇండియా వెళ్ళి వచ్చాడు ఏదో పనిమీద. ఇండియాలో తిండి ఎంత బావుంటుందో అదీ చెప్తున్నాడు. అలా పరిచయం సాగింది. డెరెక్ పరిచయం తో కల్పనకీ ఆయనకీ మధ్య ఏదో అయిపోతోందని నితీష్ కో సందేహం. పెళ్లై పిల్లలు ఉన్నా 'ఎర్రగా బుర్రగా ఉన్న మొగాడు కనిపిస్తే ఆడవాళ్ళింతే' అనుకునే మనిషి. కల్పనకి ఇప్పుడో కొత్త దరిద్రం దాపురించింది నితీష్ సందేహాలతో. తాను తామిద్దరూ అమెరికా వచ్చింది, తనకో కుటుంబం అదీ ఏర్పాటు చేసుకోవాలనీ, అ బాంబే గృహలక్ష్మి జీవితం నుండి తప్పించుకోవాలనీను. కానీ ఈయన మరో కాలంలో ఉన్నాడు. అలా మొగుడిమీద

మునుపు పెంచుకున్న అసహ్యం మరింత ఎక్కువైంది కల్పనకి.  అమెరికా వచ్చాక పదో నెలలో కాబోలు నితీష్ ఈసారి ఖరాఖండీగా చెప్పేసాడు; తాము ఇండియా వెళ్లిపోతున్నారు వెనక్కి. తిరుగులేదు.

ఆరోజు రాత్రి కల్పనకి నిద్ర పట్టలేదు. తాను బ్రిలియంట్ స్టూడెంట్ ఏదైనా చేయగలదు – ఈ మొగుడితో సంసారం తప్ప. ఈయన వెనక్కి వెళ్లాక తల్లి తండ్రీ పోయినా అక్కడే ఉంటాడనేదీ, ఆయనకి ఉన్న సంకెళ్ళు తెంపుకుని బయటకి రాలేడనేదీ సుస్పష్టం. ఓ రోజు నితీష్ ఇంటికొచ్చేసరికి తలుపులు తీసే ఉన్నాయి. కల్పన బాత్రూంలో పెట్టిన నోట్ ఉంది — "నీచుడా నువ్వింత గొప్పవాడివని తెలీదు. నీకూ, నీ తల్లితండ్రులకీ నీకు కన్న పిల్లలకీ నమస్కారం. నేను వెళ్ళిపోతున్నా."

అంతే. ఇంట్లో కల్పన పాస్ పోర్ట్, బట్టలూ, సర్టిఫికేట్లూ కూడా లేవు. ఆవిడ వెళ్లిపోయిందనేది తెలుస్తూనే ఉంది. పోలీస్ రిపోర్ట్ ఇస్తే? ఇస్తే ఏమౌతుంది? నువ్వు ఆవిణ్ణి ఎన్ని కష్టాలు పెట్టావో అని తనని జైల్లో పెట్టవచ్చు. అయినా మేజర్ అయిన ఒకావిడ తనకి 'నచ్చని సంసారంలోంచి బయటకి వెళ్ళిపోతున్నా' అని చెప్పి మరీ వెళ్ళిపోతే ఏమని ఇవ్వాలి రిపోర్టు? మర్నాటికి బుర్ర పూర్తిగా పాడై పిచ్చెక్కిన ఐఐటి కుర్రాడు ఉన్న ఉద్యోగానికి తిలోదకాలిచ్చేసి రెండు వారాల్లో బాంబే వెళ్ళిపోయాడు. ఈయన వెళ్ళాక ఏదో ఉద్యోగం చేస్తూ పిల్లల్ని పెంచుకుంటూ ఆయన జీవితం సాగుతూ ఉంది. కల్పన ఏమైంది అని ఎవరైనా అడిగితే ఈయన చెప్పే సమాధానం ఒకటే — "మేము విడాకులు తీసుకున్నాం. పిల్లల భరణం, పోషణా నాకే ఇచ్చారు కోర్టువారు; ఆవిడకి మతి స్థిమితం తప్పిందని చెప్పారు. "

జరిగిన విషయం ఏమంటే డెరెక్ గారికి మొత్తం విషయం అంతా చెప్పింది కల్పన. తాను పిల్లలూ మొగుడు లేకుండా ఉండగలదు కానీ వెనక్కి బాంబే వెళ్ళి మరోసారి గృహలక్ష్మిగా మారే ప్రసక్తే లేదు. ఇదంతా విన్న ఆయన కల్పనని తీసుకెళ్ళి మరో చోట ఉంచాడు నితీష్ ఇండియా వెళ్ళిపోయేదాకా. ఎందుకంటే ఆయన పోలీస్ రిపోర్ట్ ఇవ్వొచ్చు. వాడు ఇండియా వెళ్లిపోగానే మొగుడు ఈవిణ్ణి చెప్పకుండా వదిలేసాడని చెప్పి ఓ చర్చ్ లో జేర్పించాడు. ఏడాది తిరిగేలోపున కల్పన తన వీసా మార్పించుకుని  యూనివర్శిటీలో స్టూడెంట్ గా చేరింది. తర్వాత పి హెచ్ డి  పూర్తి చెసి ముప్పై ఐదేళ్లకే ఓ యునివర్శిటీలో ప్రొఫెసర్ గా జేరింది. కల్పనకి ఎప్పుడైనా తన పాత జీవితం గుర్తొస్తే నవ్వుకుంటుంది – తానో రబ్బరు బంతి. తనని తొక్కిపెట్టి నాశనం చేయడానికి అన్ని విధాల సహకరించాడు మొగుడు. తన కుటుంబం గురించి ఎవరైనా అడిగితే కల్పన చెప్పేది ఒకటే. తాను మహారాష్ట్రలో కొల్హాపూర్ అనే చోటనుంచి వచ్చింది. ఆ మధ్య వచ్చిన భూకంపంలో మొత్తం కుటుంబం, బంధువులూ పోయారు. తనకెవరూ లేరు.

నీతి: రబ్బర్ బంతిని నేలమీద ఎంత గట్టిగా కొడితే అంత పైకి లేస్తుంది.

Post your comments